# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 12-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పటిష్టం చేసే లక్ష్యంతో ఢిల్లీలో రేపు నిర్వహించే "నారీ శక్తి వందన్ సమ్మేళనం"లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్నారు.

- ప్రముఖ గాయని ఆశా భోంస్లే మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు.

- దేశవ్యాప్తంగా గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా యథావిధిగా కొనసాగుతోందని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

- ఐపీఎల్ లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

=======================

భారత అభివృద్ధి ప్రస్థానంలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసే లక్ష్యంతో దేశ రాజధానిలో రేపు "నారీ శక్తి వందన్ సమ్మేళనం" నిర్వహించనున్నారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. పంచాయతీల నుంచి పార్లమెంటు వరకు పాలన, నాయకత్వ బాధ్యతల్లో మహిళల పాత్రను పెంచడం, నిర్ణయాధికారంలో వారికి సముచిత స్థానం కల్పించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. 2047 నాటికి భారతదేశాన్ని "వికసిత్ భారత్"గా తీర్చిదిద్దే ప్రయాణంలో మహిళలు పోషించాల్సిన కీలక పాత్రపై ఈ వేదికగా చర్చించనున్నారు.

=======================

ప్రముఖ పుణ్యక్షేత్రం అమర్‌నాథ్ యాత్ర తేదీలు ఖరారయ్యాయి. ఈ ఏడాది జూలై 3వ తేదీన యాత్ర ప్రారంభమై.. ఆగస్టు 28న రక్షాబంధన్ పర్వదినంతో ముగియనుంది. మొత్తం 57 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈరోజు వెల్లడించారు. యాత్రకు వెళ్లాలనుకునే భక్తులు ఈనెల 15 నుంచి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని... ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానంలోనూ ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్

(PNB), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI), యెస్ బ్యాంకులకు చెందిన 554 శాఖల్లో భక్తులు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని లెఫ్టినెంట్ గవర్నర్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ గాయని ఆశా భోంస్లే ఈరోజు ముంబైలో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె నిన్న సాయంత్రం ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు మహారాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి ఆశిష్ షెలార్ తెలిపారు. రేపు సాయంత్రం 4 గంటలకు ముంబైలోని శివాజీ పార్క్‌లో ఆమె అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. 1943లో తొలిసారి సినీ గీతాన్ని ఆలపించిన ఆమె ఆరు దశాబ్దాల సుదీర్ఘ కాలంలో దాదాపు 12 వేలకు పైగా పాటలు పాడి గిన్నిస్ రికార్డు సృష్టించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ గాయని ఆశా భోంస్లే మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆమె మరణం భారతీయ సంగీత ప్రపంచంలో తీరని లోటని కొనియాడారు. ఆశా భోంస్లే దశాబ్దాల పాటు తన మధుర గాత్రంతో భారతీయ సంగీతాన్ని సుసంపన్నం చేశారని, ఆమె భౌతికంగా దూరమైనా.. తను పాడిన పాటలు శాశ్వతంగా నిలిచి ఉంటాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఆశా భోంస్లే బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కొనియాడారు. కొన్ని దశాబ్దాల పాటు సాగిన ఆమె అసాధారణ సంగీత ప్రస్థానం భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని మరింత సుసంపన్నం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. సిలిగురిలోని కావఖాలిలో ఈరోజు నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రాగానే ఈ ప్రాంతంలో ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలను ప్రాధాన్యత క్రమంలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పౌరసత్వ సవరణ చట్టం కింద మతువా, నమశూద్ర వర్గాలకు పౌరసత్వం కల్పిస్తామని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా గృహ వినియోగ ఎల్‌పీజీ (LPG) సిలిండర్ల సరఫరా యథావిధిగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. నిన్న ఒక్కరోజే 52 లక్షలకు పైగా సిలిండర్లను వినియోగదారులకు పంపిణీ చేసినట్లు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. నిబంధనలు ఉల్లంఘించిన 219 ఎల్‌పీజీ ఏజెన్సీలపై జరిమానా విధించగా.. తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడిన 56 ఏజెన్సీల లైసెన్సులను రద్దు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. చైనా చర్యలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెపుతూ.. అరుణాచల్ ప్రదేశ్ సహా భారత భూభాగాలు ఎప్పుడూ భారతదేశంలో అంతర్భాగంగానే ఉన్నాయని, ఇకపైనా అలాగే ఉంటాయని

పేర్కొన్నారు. కల్పిత పేర్లు పెట్టడం వల్ల ఈ వాస్తవం మారిపోదని, భారత్-చైనా సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చేందుకు, ఇరు దేశాల మధ్య పరస్పర అవగాహన పెంపొందించేందుకు జరుగుతున్న కృషిని ఇవి దెబ్బతీస్తాయని ఆయన హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అసలైన స్ఫూర్తితో అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వచ్చే 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలను మహిళా కోటా వర్తించేలా నిర్వహించడం అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు. ఈ నెల 16 నుంచి 18 వరకు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో.. ఉభయ సభల ఫ్లోర్ లీడర్లకు ప్రధాని లేఖ రాశారు. సుదీర్ఘ చర్చలు, సంప్రదింపుల తర్వాత నారీ శక్తి వందన్ అధినియంను దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఈ చట్టానికి సంబంధించి తీసుకురావాల్సిన సవరణలను ఏకగ్రీవంగా ఆమోదించేందుకు సభ్యులందరూ కలిసి రావాలని ఆ లేఖలో ప్రధాని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

సాంకేతికతను సాగుకు జోడించడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, అధిక దిగుబడులు సాధించవచ్చని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని రాయ్‌సేన్‌లో నిర్వహిస్తున్న `ఉన్నత వ్యవసాయ మహోత్సవం 2026` కార్యక్రమంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం పలు నూతన పథకాలను ప్రకటించిందన్నారు. `పప్పు ధాన్యాల మిషన్` కింద మధ్యప్రదేశ్‌లో 55 పప్పు మిల్లులను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. పండ్లు, కూరగాయల వంటి పంటలు కోత తర్వాత వృథా కాకుండా చూసేందుకు ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజ్ వ్యవస్థలను బలోపేతం చేస్తామని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత యువ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ఆయుష్ శెట్టి ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. చైనాలోని నింగ్బోలో ఈరోజు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఆయుష్ 8-21, 10-21తో చైనా క్రీడాకారుడు షీ యుకీ చేతిలో ఓటమి పాలయ్యాడు. ఆయుష్ శెట్టి భారత్ తరఫున 61 ఏళ్ల తర్వాత పురుషుల సింగిల్స్‌లో తొలి రజత పతకం సాధించారు. ఆయుష్ సాధించిన ఈ విజయం దేశానికే గర్వకారణమని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మనసుఖ్ మాండవీయ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా ఈరోజు ముంబైలోని వాంఖడే స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు 10 ఓవర్లు పూర్తయ్యే సరికి వికెట్ నష్టపోకుండా 115 పరుగులు చేసింది. అంతకుముందు లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై 7 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్ విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైల్వే నెట్‌వర్క్ విస్తరణ కోసం 1.53 లక్షల కోట్ల రూపాయలకు పైగా భారీ పెట్టుబడి పెట్టినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీని ద్వారా సుమారు 6 వేల కిలోమీటర్ల మేర రైల్వే లైన్ల విస్తరణ పనులు జరగనున్నాయని తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =